ప్రేమంటే ఏమిటి?

మారెళ్ల ఉమాదేవి

అతని విడిచి వుండలేనని చెల్లాయి పెళ్లికి సెలవు పెట్టి వచ్చిన మరునాడే అనిపించింది. ప్రతి క్షణం ఆమె కళ్లల్లో మెదిలేది. 'రవీ' అన్న ఆమె పిలుపే చెవుల్లో మారుమోగేది. ఆమె మాటలు పదేపదే వినాలనే ఆర్తితో కొట్టుకుపోయేవాణ్ణి.

"ఏమిటిరా అన్నయ్యా! కలకత్తా ఉద్యోగం కాదుగాని నువ్వు మరీ డల్‌గా తయారయ్యావు?" చెల్లాయి అనుమానంగా అడిగింది.

"పోవే! నేను డల్‌గా వుండడమేమిటి? 'ఈ నాగుడుకాయని కట్టుకుని బావగారు ఎన్ని అవస్థలు పడతారో' అని బెంగ పెట్టుకుంటున్నా." అన్నాను నిబ్బరంగా పోజ్ పెడుతూ.

"ఛ! ఫో" కోపం నటించింది చెల్లాయి.

"ఎలాగూ పోతాలే ఆ రెండు అక్షింతలూ వేసేసి" అన్నాను నవ్వుతూ.

యిల్లంతా బంధువుల్తో నిండిపోయింది. ఆడపెళ్లివాళ్లం కనుక అందరికీ చేతినిండా పని! "వీడికి ముందు పెళ్లి చేసేయ్యవలసింది. కోడలు చూసుకునేది ఈ తంతంతా." అమ్మ తనలో తనే గొణుక్కునేది. నాకే పనీ చెయ్యాలనిపించేది కాదు. "నాన్నగారొక్కరే ఆ పందిళ్లూ అవీ చూస్తున్నారు. మన్వు కాస్త సాయం వెళ్లకూడదూ?" అనేది అమ్మ.

అమ్మ బాధ, బంధువుల సందడి భరించలేక పెంట్లో గుట్టవైపు నడిచాను. సాయంత్రం అయింది. ఎండ చల్లబడి చల్లటిగాలి వీస్తోంది. నాపరాయిమీద నడుం వాల్చాను. ఇత గూర్చి ఆలోచనలు పిచ్చివాణ్ణి చేసేస్తున్నాయి. సిగరెట్ తీసి వెలిగించాను.

"నీ పెదిమలు ఎఱ్ఱగా అందంగా వుంటాయి. వాటిని సిగరెట్ కాల్చి మసి చెయ్యకు రవీ" ఇత మాటలు అంతరాంతరాల్లో మెదిలాయ్. అది అభ్యర్థనో, ఆజ్ఞపనో అర్థమయ్యేది కాదు. సిగరెట్ దూరంగా విసిరేసాను. అంతంలేని ఆలోచనల గతాన్ని తవ్వి తీస్తున్నాయి

* * *

ఉద్యోగం దొరకలేదు అని దిగులుపడుతున్న రోజులవి. ఆ రోజు వచ్చిన అపాయింట్‌మెంట్ లెటర్ అంతులేని ఆనందాన్ని మోసుకొచ్చింది. 'బాంక్ వుద్యోగం వచ్చింది. అదృష్టవంతుడివి.' అన్నారు అందరూ. అపాయింట్‌మెంట్ కలకత్తాలో. ఉద్యోగ పర్వంలో ప్రవేసించడానికి కలకత్తా బయలు దేరాను. అంతకుముందెప్పుడూ కలకత్తా రాలేదు. హౌరా స్టేషనులో దిగగానే కొంత దిగులువడ్డాను ఆ జనాన్నీ, వాతావరణాన్నీ చూసి. బహుశా హౌరా స్టేషన్ని చూసి కాబోలు 'దేశమంటే మట్టికాదోయ్ దేశమంటే మనుషులోయ్' అన్నాడు గురజాడ. చిత్తరంజన్ అవెన్యూలో ఆనందభవన్‌కి టాక్సీలో బయలుదేరాను.

ఇండియా ఎక్స్ఛేంజ్ ప్లేస్‌లో మా బ్యాంక్ వుంది. మొదటి రెండు రోజులూ కొంత 'కొత్త' ఫీల్ అయినా ఒక వారం రోజుల్లో అక్కడ వాళ్లతో కలసిపోయాను.

నాకోలీగ్ వర్మ అన్నాడో రోజు — మీ తెలుగు వాళ్లే ఒకరు తెలిసిన ఫామిలీ బారీగంజ్‌లో వున్నారు. వాళ్ల ఫ్రంట్ రూంలు రెండు సబ్‌లెట్ కింద యిస్తారట. చూద్దాం వస్తారా?

అప్పటికే యింటినుండి తెచ్చుకున్న డబ్బు సగంపైన అయిపోయింది లాడ్జింగ్‌కీ, భోజనానికీ.

ఆ రోజు సాయంత్రం వర్మా, నేనూ కలసి బయలు దేరాం యిల్లు చూడడానికి.

"రోజూ యింత దూరం రావాలా ?" బస్సు దిగి నడుస్తూ అన్నాను వర్మతో.

వర్మ నవ్వుతూ అన్నాడు — "యిది కలకత్తా ! యింతకన్నా దూరంనుండి వస్తారు, లూవెవ్ లేడీస్ కూడా."

'కొన్నాళ్లకి అదే అలవాటౌతుంది' అని సరి పెట్టుకున్నాను.

వర్మా, నేనూ వెళ్లేసరికి ఆమె ఫ్రంట్ రూమ్‌లో కూర్చొని ఏదో పుస్తకం చదువుతోంది. మమల్ని చూసి విష్‌చేసి కూర్చోమంది. వర్మ నన్ను పరిచయం చేసాడు. ప్రపంచంలోని అందమంతా ఆమెలోనే యిమిడి వుందా అనిపించే సౌందర్యం ఆమెది. అంతటి లావణ్యవతిని ఫస్ట్ సైట్‌లో చూసిన వారెవరైనా కాస్త తొట్రుపడక మానరు.

ఆమె మమ్మల్ని కూర్చోమని చెప్పి లోనికి వెళ్లింది. ఆమె వెళ్లిన తర్వాత అడిగాను వర్మని, 'ఇంట్లో యింకెవరూ కనపడరేం ?' అని.

'ఒక బాబు వున్నాడు' అన్నాడు వర్మ కాస్త గంభీరంగా.

ఇంతలో ఆమె బిస్కెట్లూ, టీ తీసు కొచ్చింది. "ఆయా లేదేమిటండీ" అన్నాడు వర్మ. బహుశా టీ ఆమె తీసుకుని రావడం చూసేమో.

"ఇప్పుడే బాబుని తీసుకుని వెళ్లింది కాళీ ఘాట్‌లో ఏదో పిల్లల ప్రోగ్రాం వుందని." అంది ఆమె టీ కప్పుల్లో పోస్తూ.

నాకంతా అయోమయంగా వుంది. 'ఈమె కెక్కడ పెళ్లి అయినట్టే కనిపించడం లేదు. మరి ఈ బాబు, ఆయా — పిల్లంతా ఎవరు ? ఆమె భర్త ఏడి ?' నేనేమీ మాట్లాడడం లేదని కొంత పేపటికి తెలుసుకున్నాను. "ఓల్డ్ హౌస్ బుక్స్ మీరు లైక్ చేస్తారా ?" ఏదో మాట్లాడాలి కదా అని సగం తెరచి వుంచిన ఓల్డ్ హౌస్ పుస్తకం చూస్తూ అన్నాను. ఏదో సినీ నటిని ఒక పత్రికా విలేఖరి అడిగిన ప్రశ్నలా వుందని గ్రహించి సిగ్గుపడి పోయాను వెంటనే.

"మూడ్ సరిగా లేనప్పుడు తెరుస్తాను ఓల్డ్‌హౌస్ బుక్స్. ఎంతటి సీరియస్ మూడ్‌నైనా చిటికెలో జాలీగా మార్చేసే శక్తి ఆయన రచనలకే వుందనిపిస్తుంది" అంది వెంటనే.

కొంతసేపు పుస్తకాలమీద జరిగింది మా సంభాషణ. చివరకి వర్మ అన్నాడు — ఈ రూమ్‌లు రెండూ మీ కిస్తారు. నచ్చాయా మీకు ?

నరకంలో కాపురం చేసి స్వర్గానికెళ్లి స్వర్గం బాగోలేదన్నట్టుంటుంది ఆ గదులు బాగోలేవంటే. నా కెంత తొందరగా ఆ హోటలు విడిచిపెట్టేద్దామా అని వుంది. నా అంగీకారం చెప్పాను. 'ఆదివారం వచ్చేస్తానని' చెప్పి బయలుదేరాం.

దారిలో వర్మ చెప్పాడు ఆమె గూర్చి — ఆమె 'కోల్ ఇండియా'లో ఒక ఎగ్జిక్యూటివ్. భర్త క్రిందటి సంవత్సరం కారు యాక్సిడెంట్‌లో మరణించాడు. అతనూ, వర్మా ఫామిలీ ఫ్రెండ్స్. ప్రస్తుతం ఆమె ఒక్కర్తే బాబుతో వుంటోంది. బాబుకోసం ఒక ఆయాని పెట్టుకుంది. తల్లి,

ప్రేమంటే ఏమిటి ?

తండ్రి మద్రాసులో వుంటున్నారు. వీళ్లది ఇంటర్ కేస్ట్ మ్యారేజ్. ఆ కోపంతోనే ఆమెనైపు వాళ్లెవరూ రారు.

'యింతటి అందాల రాశిలో యిన్ని అగ్ని పర్వతాలా !' అనుకుని నిట్టూర్చాను.

* * *

ఆ యింట్లోకి మారి ఒక నెల గడిచింది. ఈ నెలరోజుల్లో ఆ కుటుంబ సభ్యులు ముగ్గురితో బాగా చనువేర్పడింది. లత నా కంటే నాలుగేళ్లు పెద్ద. నన్ను 'నువ్వు' అనే పిలిచేది. నేను 'లతగారూ' అనకపోయినా ఆమెని 'నువ్వు' అని మాత్రం పిలవలేకపోయేవాణ్ణి. బ్యాంక్‌నుండి రాగానే బాబు 'అంకుల్' అంటూ వచ్చేసేవాడు. బాబుని చూస్తూవుంటే ఎంతో సరదా అనిపించేది. తెల్లగా, బొద్దుగా వుండేవాడు. 'తల్లికితగ్గ బిడ్డ' అనుకోక మానరు చూసినవారెవరైనా.

ఇదీ లోకం !

'బాబూ ధర్మం ... ' అంటే
'కూలిపని చేసుకోవయ్యా'
అంటారు ! ...
'పెట్టె పట్టమంటారా' అంటే
'రిక్షా అయితే నేనూ పోవచ్చు'
అంటారు ! ...
'రిక్షా కావాలా' అంటే
'సిటీ బస్సయితే చవక'
అంటారు ! ...
తీరా బస్సెక్కి
కండక్టరు డబ్బులడిగేలోగా,
తన స్టాప్‌చ్చి
బాబుగారు మెల్లిగా జారుకుంటారు ! ...

— కోరిమిల్లి సూర్యశంకర్

'నేను వచ్చి ఒక నెల అయింది. ఐ మీన్ నేను రెంట్ ఎంత పే చెయ్యాలో ... ' అన్నాను తడబడుతూ ఒకరోజు లతతో.

'నిన్ను చూస్తూవుంటే రోజూ డేట్‌లు లెక్క పెడుతూ కూర్చుంటున్నట్టున్నావు. నీ దగ్గర నుండి రెంట్ తీసుకుని నేనేం మేడలు కట్టదలుచుకో లేదు. కావలసివస్తే నేనే అడుగుతాను. అంతేకాని దీనికోసం నువ్వు బెంగపడిపోయి నన్నొక గాబూలీవాలా చేసేయ్యకు' అంది లత నవ్వుతూ. ఒక్కోసారి లత ఎంతో చలాకీగా మాట్లాడుతుంది. అటువంటప్పుడు ఆమెతో అలా మాట్లాడుతూనే కూర్చోవాలనిపిస్తుంది. కానీ ఒక్కోసారి ఆమె మూడ్ చాలా సీరియస్‌గా వుంటుంది. అప్పుడు ఆమెని పలుకరించాలంటేనే భయం కలుగుతుంది.

'లత రెంట్ తీసుకోవడంలేదు.' ఆ మర్నాడు వర్మతో అన్నాను.

'బహుశా తీసుకోదేమో ! ఆమెకి అవుపరం లేదు కూడా. ఆమె లోన్లినెస్ కిల్ చెయ్యడానికి నేనే సజెస్ట్ చేసాను, ఆ రెండు రూమ్‌లు నీ కియ్యమని' అన్నాడు వర్మ.

అలా వుండాలంటే నా కిబ్బందిగా వుంటుంది అని చెప్పాను వర్మతో. చివరకి వర్మ సలహాపై ఆమె ఎకౌంట్‌లో వెలకి వందరూపాయలు క్రెడిట్ చెయ్యడానికి నిశ్చయించుకున్నాను.

* * *

మరో రెండు వెలలు గడచేసరికి నేను కూడా ఆ యింటి సభ్యులలో ఒకడిగా అయిపోయాను. ఏదో ఆత్మీయత మా ముగ్గురిలో అల్లుకుపోయింది. యింటికి రావడం లేట్ అవుతే, బాబు, లతా ఏక కంఠంతో అడిగేవారు 'ఎందు కాలస్యం అయింది' అని. లత రోజూ వాళ్ల ఆఫీస్‌కారులో వచ్చేసేది.

ఆ రోజు ఆదివారం. వారం అంతా ఆదరా బాదరాగా పురికలూ, పరుగులూ పెట్టే కలకత్తా వాసులకి 'ఆదివారం' అంటే 'పోయిగా గాలిపీల్చుకునే వారం' అన్నమాట.

పదిగంటలకల్లా మెస్‌లో భోజనం ముగించుకుని సరాసరి యింటికి వచ్చేసాను, లతతో కలసి ఏదైనా మాన్‌షోకి వెళ్దామని. ఆమె రూమ్‌లోకెళ్లాను. మంచంమీద పడుకుని యింటి కప్పుకేసి చూస్తూ ఏదో ఆలోచిస్తోంది. గుండెలమీద 'నెపోలియన్' పుస్తకం సగం తెరచివుంది. తలకి స్నానం చేసి నట్టుగా వుంది. వదులుగా కట్టివున్న శిరోజాలు ఫ్యాన్‌గాలికి నాట్యం చేస్తున్నాయి.

నన్ను చూడగానే లేచి కూర్చుని బెడ్‌మీదే కూర్చుంటూ 'ఊరకరాడు రవిబాబు.. ఏమిటి విశేషమేనుభావా ట్రిమ్‌గా తయారై వచ్చావ్ ?' అంది నవ్వుతూ.

'న్యూ అంపైర్‌లో 'చిత్‌చోర్' మాన్‌షో వుంది వస్తావా ?' అన్నాను. లతని 'నువ్వు' అని పిలుస్తూ కొద్దిరోజులైంది.

'యు ఆర్ ఆఫెన్ అవర్ లేట్ మై బాయ్. ఆయా బాబుని ఎక్కడికో తీసుకెళ్లింది. కీస్ తీసుకెళ్లిందో లేదో' అంటూ లేచింది లత.

నేను కొంత నిరుత్సాహపడ్డాను. "పోనీ ఎల్లుండి ఎలాగూ సెలవే కదా ! అప్పుడు వెళ్దాం" అన్నాను.

"ఫర్వాలేదు. తాళాలు బెనర్జీగారింట్లో ఇచ్చి వెళ్దాం. నువ్వు కూర్చో. క్షణంలో తయారై పోతాను." అంటూ డ్రెస్సింగ్ టేబుల్ దగ్గర కెళ్లింది.

ఆమె చదువుతూ వుంచిన 'నెపోలియన్' తిరగేస్తూ కూర్చున్నాను. 'ఎంతటివారైనా కాంతకి దాసులన్న నానుడికి నెపోలియన్ ఒక నిదర్శనం' అన్నాను. ఏదైనా ఒకపుస్తకం ఎవరైనా చదువుతూ వుంటే దానిగూర్చి కొంత చర్చించుకోవడం అలవాటైపోయింది.

'అవును పాపం. కోరి వివాహం చేసుకుని కూడా జాసెఫైన్ చేతిలో కీలుబొమ్మైపోయాడు' అంది ఆమె సానుభూతిగా.

కొత్తలో లత చరిత్ర విన్న తర్వాత ఆమె పట్ల ఏదో సానుభూతి ఏర్పడింది. తర్వాత ఆమెలోని నిందుదనం, ఆమె నిష్కల్మషమైన ప్రవర్తనా —

ఆమెపట్ల ఒక పవిత్రభావం ఏర్పరిచాయి. నిండు కుండలాంటి మనసు ఆమెది. ఎన్ని విభూతాలన్నా విరునవ్వుతో ఎదుర్కొనే సహనం ఆమెలో మూర్తీభవించి వుంది.

ఆడది అంటేనే అయస్కాంతం అంటారు. ప్రపంచంలోని ప్రతీ అందమైన వస్తువుని ప్రత్యేక శ్రద్ధతో ఏరి కూర్చి సృష్టించాడు భగవంతుడు లతని. ఆమె 'నాది కావాలి' అనే కోర్కె ఎప్పుడు మొదలైందో తెలియదు కాని, రాను రాను అది తీవ్రం కాసాగింది. నా ఊహలోంచి బయట పడేసరికి లత రెడీ అయిపోయింది. మబ్బురంగు డ్రెల్లాన్ చీరలో పచ్చని శరీరం మెరిసిపోతోంది! యింతటి అందాల రాశి ప్రక్కన నడుస్తూ వెళ్లడం— నిజంగా క్రిందటి జన్మలో ఏదో పుణ్యం చేసుకుంటేనే కాని ప్రాప్తించదు. పాపం 'బిమల్' ఎంత దురదృష్టవంతుడు ?!

'ఏమిటలా బిత్తరపోయావ్ ? టిక్కెట్స్ నేనే తీస్తాను' అంది నవ్వుతూ.

'అదేం కుదరదు. అలాగైతే నేను రాను' అన్నాను.

'పద నాయనా ముందు. ఆ విషయం హాలు దగ్గర చర్చించుకుందాం.' బేగ్ భుజాన తగిలించుకుంటూ అంది లత.

ప్రతీ ఖర్చూ ఆమె పెట్టడం నా కెంతో కష్టం అనిపించింది. బహుశా నేనొక మామూలు గుమాస్తాని కనుక ఆ ఖర్చుపెట్టే తాహతు నాకు లేదేమోనని ఆమె ఉద్దేశమేమో! ఆ మాటే అన్నాను ఆమె డోర్ లాక్‌చేస్తూ వుంటే. ఆమె షాక్ తగిలినట్టు ఫీలైంది నేనలా అనడం చూసి. 'ఛ! అవేం మాటలు రవీ. నిన్ను నువ్వు ఎందుకలా కించపరచుకుంటావ్ ? ప్లీజ్ అలా ఎప్పుడూ అనుకోకు.' అంది బాధతో నిండిన గొంతుతో.

'ఐ యామ్ సారీ లతా' అంతకంటే ఏమనాలో తోచలేదు.

'నో సారీస్. బి క్విక్. టైమైపోతోంది.' అంటూ పక్క వాళ్లింటివైపు త్వర త్వరగా నడిచింది.

* * *

సినిమా విడిచిపెట్టేసరికి మూడైంది. హాల్లోంచి బయటకొచ్చేసరికి వర్షం కుంభవృష్టిగా కురుస్తోంది. 'భీషన్ వ్రిష్టి' అనుకుంటున్నా రందరూ.

కలకత్తాలో పట్టుమని పది నిముషాలు కురిస్తే చాలు నగరం అంతా స్థంభించిపోతుంది. ఒకటి రెండూ బస్సులు వెళ్తున్నాయి. కాని ఇసుకేస్తే రాలనంత జనంతో నిండివెళ్తున్నాయి. నిచ్చెనలు పట్టుకుని వేళ్లాడుతున్నారు జనం. జన సమ్మర్దం కాస్త పలుచగా వున్న ప్రదేశం చూసుకుని నిలబడ్డాం.

ఒక గంట.

రెండు గంటలు.

మూడు గంటలు గడచిపోయాయి. అలాగే నిలబడ్డాం ఏదైనా వాహనం దొరుకుతుందేమోనని. 'సారీ లతా, నా వలనే నీకీ ట్రబుల్ కలిగింది' నేను చాలా బాధపడ్డాను.

'ఈ మహానగరంలో బతకాలంటే యిటువంటివి భరించక తప్పదు. మధ్య నువ్వెందుకు బాధపడడం' నిబ్బరంగా అంది ఆమె.

ఆరున్నర కావస్తూంటే ఇక టాక్సీలమీద ఆశ వదులుకుని 'షియల్దా' స్టేషనుకి బయలుదేరాం. మోకాలి నీటిలో కుంటుకుంటూ నడుస్తూ షూస్ ఒక చేత్తో, మోకాళ్లవరకూ ఎత్తిపట్టుకున్న కుచ్చెళ్లనొక చేత్తో. నడుస్తున్న లతని చూస్తూ వుంటే నా మనసు విలవిల లాడిపోయింది.

బాలీగంజ్ స్టేషనులో దిగి ఇంటికి చేరేసరికి రాత్రి పదైంది. ఆయా, బాబూ నిద్రపోయారు. లతా, నేనూ కలిసి భోజనం చేసాం.

పడుకున్నానన్న మాటేగాని నిద్రరాలేదెంతకీ. ఏదో కావాలన్న తపన మొదలైంది నాలో. తడిసిన లత శరీరం కళ్లఎదుట మెదిలేది.

కోరికలకి లోబడ్డ మనిషి మంచీ, చెడూ గుర్తించే విచక్షణాజ్ఞానానికి దూరంగా విసిరివేయబడతాడేమో! మెల్లగా నడుస్తూ లత గదివైపు నడిచాను. లత నిజంగా నన్ను ప్రేమిస్తోంది. ఈ సమయంలో నా కోరిక కాదనదు. గది తలుపు లోపలనుండి బోల్ట్ చేసిలేదు. మెల్లగా తెరిచాను. నైట్ బల్బ్ వెలుగుతోంది. పలుచటి నీలం రంగు గదంతా నిండివుంది. లేత నీలం రంగులో లత శరీరం ఎంతో ఆకర్షణీయంగా వుంది. పైట పూర్తిగా తొలగిపోయి వుంది. బాబు ఆమె పొట్ట మీద చెయ్యివేసి నిద్రపోతున్నాడు. విపరీతంగా అలసి వుండడం వలన ఆదమరచి నిద్రపోతోంది లత. నాలో ఏ మూలో మానవత్వం మేలుకొంది. 'ఛ! యింత అమాయక ప్రాణికా అపకారం చెయ్యబోయేది?' లత నిజంగా నన్ను ప్రేమిస్తోంది. 'నువ్వు నా దానివైన తరువాతే నీ పక్కన చేరుతాను లతా!' అనుకుని అడుగులో అడుగు వేసుకుంటూ వచ్చి నా మంచంమీద వాలిపోయాను.

* * *

చెల్లాయి పెళ్లి రెండు రోజులుంది. లతకి ఇన్విటేషన్‌తోపాటు ఉత్తరం కూడా రాసాను బాబుకి తండ్రినయ్యే అదృష్టం ప్రసాదించమని. ఉత్తరం పోస్ట్ చేసిన తర్వాత తృప్తిగా నిట్టూర్చాను. నాలో చాలా కాలమై రేగుతున్న తుఫాను భీభత్సం తగ్గింది. లత జవాబుకోసం ఆతృతగా ఎదురు చూస్తున్నాను.

* * *

"నీకో లెటర్ వచ్చిందిరా అన్నయ్యా!" అన్న చెల్లాయి పిలుపుతో వాస్తవంలోకి వచ్చాను. చీకటి పడింది. "నాన్న టౌన్ వెళ్తూ ఉత్తరాలు తీసుకున్నారట. యిప్పుడు తెచ్చారు. యింత చీకటి పడే వరకూ ఒక్కడివీ ఏం చేస్తున్నావ్ ?" అంది చెల్లాయి పుత్తరం అందిస్తూ.

ఆ కవరు లత దగ్గరనుండి వచ్చినదే! ఇంటికి చేరితేకాని చదవడం కుదరదు. "అరే! ఎంత చీకటి అయిపోయింది ? చల్లటిగాలి వీస్తోంది కదూ! చిన్నకునుకు పట్టేసింది" అన్నాను కొంచెం గిల్టీగా.

ఇంటివైపు నడుస్తూవుంటే అడుగులు తడబడుతున్నాయి. యింకొద్ది సేపటిలో నేను హిమాలయా శిఖరాన్ని అధిగమించిన అనుభవాన్ని పొందుతానో లేక పాతాళంలోకి కృంగిపోతానో!?

అల్లకల్లోలంగా వున్న మనసుని అదుపులోకి తెచ్చుకుంటూ వణుకుతున్న చేతుల్తో ఉత్తరం చించాను. ముత్యాల సరాల్లాంటి అక్షరపంక్తులను ఆతృతగా చదవసాగాను.

"రవీ,

'అంకుల్ పుత్తరం రాసాడా నాని' అంటూ ఎంతో సంబరంగా తెరిచిన నీ ఉత్తరం చూసి ఎంత బాధపడ్డానో నువ్వు ఊహించలేవు. ఇది నువ్వు రాసిన ఉత్తరమంటే ఇప్పటికీ నమ్మకం కుదరడం లేదు. భరింపరాని ఈ నగ్నసత్యం అబద్ధం అయి వుంటే ఎంత బాగుండేది !? ఎంతో అమాయకంగా, ఏమి ఎరుగని వాడిలా వుండే నువ్వు ఎందుకిలా రాసావ్. నా అన్న వాళ్లందర్నీ పోగొట్టుకుని ఒంటరి జీవితాన్ని దుర్భరంగా గడుపుతున్న నేను చిన్న తనంలోనే పోగొట్టుకున్న తమ్ముణ్ణి నీలో చూసుకుని సంబరపడుతున్న నాకు యిటువంటి వరుస పెడతావా?

ప్రేమా, గీమా అంటూ — ఓహ్, ఎన్ని రాసావ్! ఎక్కడ నేర్చావోయ్ యివన్నీ ? స్త్రీ, పురుషుల మధ్య వుండవలసింది ఒక నీవూహించిన ప్రేమ మాత్రమేనా ? ప్రేమించే హక్కు నీకు లేదనను. కానీ ... రవీ, అందుబాటులో వున్నదానిని ప్రేమించాలి. నా జీవితంలో సర్వం 'బిమల్'కి అర్పించాను. ప్రస్తుతం నా చుట్టూ గిరి గీసుకుని బ్రతుకుతున్నా. యిక ఆ గిరి దాటి ఎవ్వరూ ప్రవేశించలేరు.

నువ్వు అనుకుంటున్నది ప్రేమే అనిపించుకోదు రవీ. మోహం! కాకపోతే కామం!! అది శాశ్వతం కాదు.

నీలాగా ఎందరో అన్నారు. కాని ... కాని వాళ్లల నువ్వు కూడా ... యిక అనవసరంగా పొడిగించడం నా కిష్టంలేదు. నేనూ, బాబూ డార్జిలింగ్ వెళ్తున్నాం. వచ్చేసరికి ఒక నెల రోజులౌతుంది. ఈలోగా దయచేసి రూమ్‌లు రెండూ ఖాళీ చేసి వెళ్లిపో. తిరిగి కలుసుకోడానికి ప్రయత్నం చెయ్యకు.

నీ పరిచయం ద్వారా మరో పాఠాన్ని నేర్చుకున్నాను, ప్రతీవారిని నమ్మకూడదని. ఇంకా యిటువంటివి ఎన్ని ఎదురౌతాయో!

గుడ్ బయ్.

లత." ★

ఆంధ్రపత్రిక

ఆదివారం

అనుబంధంలో

★ విజయవాడ, మదరాసు, హైదరాబాదు సినిమా వార్తలు

★ ప్రేక్షకుల తీర్పు

చదవండి!